స్విమ్మింగ్‌లో మోక్షితకు గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని పెర్కిపాలెం గ్రామానికి చెందిన కోరశిఖ మోక్షిత అంతర్‌జిల్లా ఈత పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నెల 25న పల్నాడు జిల్లా నర్సరావుపేట ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలలో నిర్వహించిన ఈత పోటీల్లో పాల్గొన్న మోక్షిత వంద మీటర్ల బెస్ట్ స్ట్రోక్ విభాగంలో ఈ ఘనత సాధించింది. సెప్టెంబర్‌లో కేరళలోని త్రివేండ్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లోయ పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు మోక్షిత తెలిపింది. ప్రస్తుతం విస్డ ఎడ్యుకేషనల్ సొసైటీ స్విమ్మింగ్ కోచ్ సిహెచ్‌ఎస్‌ఎస్‌.వర్మ ఆధ్వర్యంలో ఈతలో శిక్షణ తీసుకుంటున్నట్లు ఆమె తండ్రి కోరశిఖ వీర్రాజు తెలిపారు. మోక్షిత విజయంపై ఆ గ్రామ సర్పంచి కందుల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి కోరశిఖ పెద్దిరాజు, వీరవాసరం వ్యవసాయ సలహా మండలి మాజీ ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, గ్రామపెద్దలు అభినందించారు.

ఎస్‌ఐల బదిలీల్లో చెల్లని

ఎంఎల్‌ఎల సిఫార్సు లేఖలు

అమరావతి ఆదేశాలతోనే

ఎస్‌ఐ, సిఐల బదిలీలు

వైసిపి హయాంలో

టిడిపి నేతలపై కేసు పెడితే

పోస్టింగ్ కష్టం

ఐదేళ్లు ఒకేచోట పని చేసిన

సిబ్బంది బదిలీలపై స్పష్టత కరువు

జీరో సర్వీస్ రిక్వెస్ట్ బదిలీలపై

మౌనం

పోలీసు శాఖలో బదిలీల బెంగ..!



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలీస్‌శాఖలో సిఐ, ఎస్‌ఐల బదిలీలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు జిల్లాల్లో ఇటీవల కాలంలో పెద్దఎత్తున సిఐ, ఎస్‌ఐల బదిలీలు జరిగాయి. బదిలీలకు సంబంధించి మరో జాబితా విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. చాలామంది అధికారులు ఎంఎల్‌ఎల సిఫార్సు లేఖలు తీసుకుని తాము కోరుకున్న చోటుకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేసినా చుక్కెదురైనట్లు తెలుస్తోంది. బదిలీల ప్రక్రియ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రమేయంతో కాకుండా అమరావతి నుంచి వచ్చే ఆదేశాలతో జరుగుతుందని చెబుతున్నారు. జిల్లా అధికారులు బదిలీల జాబితా తయారు చేసి అమరావతికి పంపిన తర్వాత అక్కడ నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా సిఐ, ఎస్‌ఐలను బదిలీ చేస్తున్నట్లు తెలుస్తోంది. బదిలీల కోసం అమరావతిలో ప్రత్యేకంగా ఒక టీమ్ పని చేస్తున్నట్లు చెబుతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వైసిపి నాయకులను అనుకూలంగా వ్యవహరించిన, ఏదైనా కారణంతో అప్పట్లో టిడిపి నాయకులపై కేసు నమోదు చేసిన అధికారులకు పోస్టింగ్ ఇవ్వకుండా నిలుపుదల చేస్తున్నారు. కొంతమందిని పక్కన పెడుతున్న పరిస్థితి కన్పిస్తోంది. పశ్చిమ, ఏలూరు జిల్లాల్లో ఈ విధంగా పలువురి ఎస్‌ఐలకు పోస్టింగులు ఇవ్వకుండా పక్కన పెట్టిన పరిస్థితి ఉందని తెలుస్తోంది. పోస్టింగ్ ఇవ్వకుండా ఆపిన అధికారుల గురించి ఎంఎల్‌ఎలు నేరుగా పైస్థాయిలో మాట్లాడినా పట్టించుకోవడం లేదని సమాచారం. దీంతో ఎంఎల్‌ఎలు సైతం ఏమి చేయలేక చేతులెత్తేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఎంఎల్‌ఎలు సిఫార్సులు లేఖలు ఇచ్చినప్పటికీ అధికారులను సైతం పక్కన పెట్టడం పోలీస్‌శాఖలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కిందిస్థాయి అధికారులు పని చేస్తారు. కొంతమంది ఎస్‌ఐ, సిఐలపై కక్షగట్టి పోస్టింగ్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం పోలీస్ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. గత వైసిపి ప్రభుత్వం ఇదేవిధంగా చేసిందని కొత్త ప్రభుత్వం వచ్చాక ఇటువంటివి కొనసాగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తప్పు చేయని కొంతమంది అధికారులను కూడా వైసిపి అనుకూల జాబితాలో చేర్చి పోస్టింగ్ ఇవ్వడం లేదనే అభిప్రాయం పోలీస్‌శాఖలో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి వదిలి పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది. పోలీస్ శాఖాధికారుల బదిలీల్లోనూ పెద్దఎత్తున రూ.లక్షల్లో మామూళ్లు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీస్ సిబ్బంది బదిలీలపై స్పష్టత ఏది..?

పోలీస్‌శాఖలో బదిలీలపై సర్వత్రా చర్చ సాగుతోంది. 15 శాఖల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఈ నెల 19న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 31వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. పోలీస్ శాఖలోని సిబ్బంది బదిలీలకు సంబంధించి మాత్రం ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని, అనారోగ్య సమస్యలు, కుటుంబంలోని ఇబ్బందుల నేపథ్యంలో ఎంతోమంది పోలీస్ సిబ్బంది రిక్వెస్ట్ బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. పోలీస్‌శాఖలో సిబ్బందికి సంబంధించి బదిలీ ఆదేశాలు ఎందుకు ఇవ్వలేదనే చర్చ నడుస్తోంది. రెండు జిల్లాల్లో దాదాపు మూడు వేల మంది వరకూ పోలీస్ సిబ్బంది ఉన్నారు. దాదాపు 60 వరకూ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ప్రతి స్టేషన్‌లోనూ ఐదేళ్లు పూర్తి చేసుకున్న సిబ్బంది నలుగురైదుగురు ఉన్న పరిస్థితి. అంతేకాకుండా జీరో సర్వీస్ బదిలీల కోసం ఎదురుచూస్తున్న సిబ్బంది చాలామంది ఉన్నారు. పోలీస్ శాఖలోని సిబ్బంది బదిలీలపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. పోలీస్ సిబ్బంది బదిలీలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇచ్చి ప్రక్రియ చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు.

టిడిపి గూటికి ఏలూరు మేయర్ దంపతులు

బొద్దాని, ఆయన కుమార్తెతోపాటు మంచెం మైబాబు చేరిక

పెద్దఎత్తున కార్పొరేటర్లు చేరేందుకు రంగం సిద్ధం



నారా లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు మంగళవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్ సమక్షంలో టిడిపి గూటికి చేరారు. వీరితోపాటు ఏలూరులో వైసిపి కీలక నేతలుగా కొనసాగిన బొద్దాని శ్రీనివాస్, ఆయన కుమార్తె అఖిల, మంచెం మైబాబు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అమరావతిలో వీరందరికీ లోకేష్ పార్టీ కండువా కప్పి చేర్చుకున్నారు. వీరిని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి దగ్గరుండి తీసుకెళ్లారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మేయర్ దంపతులతోపాటు, ఇతర వైసిపి నాయకులంతా వైసిపికి దూరంగా ఉంటున్నారు. తమ పదవులు కాపాడుకోవడం, వ్యాపారాలు సవ్యంగా సాగడం వంటి అనేక కారణాలతో టిడిపికి దగ్గరవుతూ వచ్చారు. అధికారికంగా మాత్రం మంగళవారం టిడిపిలో చేరారు. ఏలూరు కార్పొరేషన్‌కు చెందిన మరో 30 మంది కార్పొరేటర్లు టిడిపిలో చేరనున్నట్లు చెబుతున్నారు. వీరంతా ఎంఎల్‌ఎ చంటి ఆధ్వర్యంలో చేరతారా.. లేక రాష్ట్రనేతల సమక్షంలో చేరతారా అనే సందిగ్ధత కొనసాగుతోంది.

అధిక విద్యుత్ బిల్లులు తగ్గించండి

తాళ్లకోడు వాసుల వినతి



వినతిపత్రం అందిస్తున్న నేతలు, బాధితులు

ప్రజాశక్తి - ఆకివీడు

తాళ్లకోడు కాలనీలో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, తక్షణమే వాటిని తగ్గించాలని పట్టణ పౌరుల సంక్షేమ సంఘం పట్టణ కన్వీనర్ బివి.వర్మ డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత ప్రజలతో కలిసి విద్యుత్ శాఖ ఎఇని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ కాలనీలో 500 మందికిపైగా కుటుంబాలు నివశిస్తున్నాయని తెలిపారు. అక్కడ విద్యుత్ శాఖ నుండి మీటర్ రీడింగ్ తీసేవారు ప్రతినెలా సక్రమంగా రీడింగ్ తీయడం లేదని, డోర్ లాక్ అని రాసుకుంటూ తాళ్లకోడు ప్రజలపై మోయలేని భారాలను మోపుతున్నారని విమర్శించారు. ప్రతి నెల రూ.200 నుండి రూ.400 వరకు రావాల్సిన విద్యుత్ బిల్లులు రూ.1500 నుండి రూ.2000 వరకు వస్తున్నాయన్నారు. మూడు నెలల యూనిట్లను ఒకేసారి నమోదు చేయడంతో స్లాబ్ రేట్లు మారిపోయి విద్యుత్ బిల్లులు భారీగా పెరుగుతున్నాయన్నారు. విద్యుత్ బిల్లులు సక్రమంగా అందించని రీడింగ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలానే కాలనీలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదని, మరమ్మతు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ వచ్చే నెల నుండి విద్యుత్ బిల్లుల మంజూరులో ఇబ్బందులు రాకుండా, శ్లాబ్ రేట్లు మారకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో మరమ్మతులు చేపడతామన్నారు. కార్యక్రమంలో తాళ్లకోడు నివాసులు పిసిని శ్రీను, దూబ భారతి, టి.లక్ష్మి, పి.గంగ తదితరులు పాల్గొన్నారు.

వచ్చారు.. వెళ్లారు..

అధికారులకు కానరాని మృతురాలి కుటుంబీకులు

ప్రశ్నార్థకంగా దుర్గాలహరి మృతి

ఆకివీడు : మండలంలోని దుంపగడపలో జ్వరంతో బాలిక మృతిచెందిన ఘటనపై విచారణకు వచ్చిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దుంపగడపలో అడుగు పెట్టకుండానే వెను తిరిగారు. మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి అధికారులు వచ్చి, విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆసుపత్రిలో ఉన్న రోగులతో మాట్లాడి వెళ్లిపోయారు. ఎందుకు వచ్చారో! ఎందుకు వెళ్లారో! ఎవరికీ తెలియని విషయం. పరిస్థితిని విచారించేందుకు వచ్చారా, అధికారులకు మద్దతు తెలిపేందుకు వచ్చారా.. ఇవన్నీ అక్కడ వారికి ధర్మసందేహాలే. దుంపగడపలో మరణించిన దుర్గాలహరి కుటుంబీకులను కానీ ఆమె తల్లిదండ్రులను కానీ అధికారులు నేటికీ కలవలేదు. అసలు ఆమె ఎలా చనిపోయింది అన్నది రహస్యంగానే ఉండిపోయింది. న్యూమోనియా తరహా సమస్యతో ఆమె చనిపోయి ఉండవచ్చునని వారి అంచనా. అయితే వైద్యులు చేసిన నిర్లక్ష్య వైద్యం వల్ల తమ బిడ్డ చనిపోయింది అంటూ మృతిరాలి బంధువులు, తల్లిదండ్రులు ఆరోపించారు. అయితే అది తప్పని గాని, ఏ రకమైన వైద్యం చేశారన్నది గాని ఇప్పటికీ వారు బహిరంగపరచలేదు. న్యూమోనియాకి ఏరకమైన వైద్యం చేయొచ్చు, ఆరోజు వైద్యాధికారి చేసిన వైద్యం న్యూమోనియాకి సంబంధించినదా, అంతకుముందు ఆమెకు ఏదైనా వైద్యం జరిగిందా అనే వివరాలు ఎవరి దగ్గరా లేవు. మండల వైద్యాధికారి ఆదేశాల మేరకు జరిపిన వైద్యం ఏమిటి అన్నది ఇప్పటికీ తెలీలేదు. దుంపగడపకి 14 కిలోమీటర్ల దూరంలో మండల ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం ఉంది. నాలుగు కిలోమీటర్ల దూరంలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఈ కేంద్రానికి దుంపగడపని అనుసంధానం చేయాలని చాలామంది చాలాసార్లు అడిగారు. ఆకివీడులో ఉండవలసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాగితాలకే పరిమితమైంది. అధికారులు ఏమయ్యారో తెలవదు, ఇక దుర్గాలహరి మరణంపై కనీసం విచారణ కూడా జరగలేదు. వచ్చిన అధికారులు కూడా తమ కింది వైద్యులకి మద్దతిచ్చి వెళ్లిపోయారని కొందరి భావన. కాగా మృతురాలి తల్లిదండ్రులని కనీసం విచారణ గాని, పరామర్శ గాని చేయలేదు. గ్రామం మొత్తం సుమారు నెలరోజుల నుంచి విషజ్వరాలతో, వింత వింత రోగాలతో వణికిపోతుంది. నేటికీ ఆ రోగం పేరు గాని, సమస్య పేరు గానీ ఏ ఒక్క వైద్యాధికారి నిర్ధారించలేదు. అడిగితే జ్వరాలు తగ్గిపోతాయి అటున్నారే తప్ప ఎవరూ సమాధానం చెప్పే పరిస్థితి లేదు. కనీసం అక్కడ జ్వరం ఏమిటి, రోగాలు ఏమిటి, ఎలా తగ్గించాలి, ఎంతమంది రోగగ్రస్తులు ఉన్నారో అన్నటువంటి గణాంకాలు కూడా అధికారుల వద్ద నేటికీ లేవు. తూతూ మంత్రంగా వైద్య శిబిరం పెడుతున్నారు తప్ప ఏ ఇంట్లో ఎంతమంది రోగంతో ఉన్నారనే లెక్క ఎవరికీ తెలియదు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం

ప్రజాశక్తి - భీమవరం

డిఇఒ కార్యాలయ అధికారికి వినతిని అందజేస్తున్న ఉపాధ్యాయులు

వివిధ రకాల పనులతో ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి రామభద్రం డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్లో డిఇఒ కార్యాలయ అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వారు మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దుచేసి, బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. ప్రత్యేకించి మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత నుంచి తొలగించాలని గత ప్రభుత్వంపై పోరాటాలు చేయడం జరిగిందన్నారు. పోరాటాల ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత నుంచి ఉపాధ్యాయులను తొలగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. అయితే ఈ ఫొటోలు ఎస్‌ఎంసి ఛైర్మన్, సభ్యులు, గ్రామ సచివాలయ అసిస్టెంట్ల చేత తీయించాలని చెప్పడం జరిగిందన్నారు. ప్రతిరోజు సాయంత్రం 3 గంటల నుంచి 3.30 మధ్య పది అంశాలతో కూడిన గూగుల్ ఫామ్ పూర్తిచేసి ప్రధానోపాధ్యాయులు అప్లోడ్ చేయాలని చెప్పారని గుర్తుచేశారు. ఎస్‌ఎంసి సభ్యులు, సచివాలయ అసిస్టెంట్ ఫొటోలు తీయకపోతే ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాలని చెప్పడం జరిగిందన్నారు. మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత తగ్గిందని భావిస్తున్న తరుణంలో మరింత భారాన్ని మోపుతూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని యుటియఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మరుగుదొడ్ల ఫొటోలకు సంబంధించి ఏరకమైన పనులు ఉపాధ్యాయులకు అప్పచెప్పడం సరైనది కాదన్నారు. తక్షణం మరుగుదొడ్ల ఫొటోల పని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని రకాల బోధనేతర పనులను ఉపాధ్యాయుల నుంచి తొలగించి, బోధనకే పరిమితం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, జిల్లా కోశాధికారి పట్టాభి రామయ్య, యుటిఎఫ్ నేతలు పాల్గొన్నారు.

డాక్టర్ రంగరాజుకు అభినందన

ఉండి: విద్యార్థులకు విద్యనందించి చైతన్యపరచడమే కాకుండా నాటక రంగంలోనూ తనదైన శైలిలో పరిశోధనలు చేస్తున్న డాక్టర్ రంగరాజు బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గాదిరాజు రంగరాజును, సామాజికవేత్త చెరుకువాడ రంగసాయిను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా పనిచేసి, సమాజ సేవ చేస్తూ, స్వయంగా నటిస్తూ నాటకం మీద పరిశోధన చేయటం అభినందనీయం అన్నారు. ప.గో జిల్లా నాటకం మీద పరిశోధన చేసి డాక్టరేట్ పొందడం రాష్ట్రానికే గర్వకారణం అన్నారు. మైసూరు యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన డాక్టర్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ ఉండి ఎంఎల్‌ఎ లాంటి వారు చాలామంది తనను ప్రోత్సహించడం కారణంగానే ఈ పరిశోధన చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, కొత్తపల్లి నాగరాజు రంగరాజును అభినందించారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాలాభివృద్ధి

ఎంఎల్‌ఎ ధర్మరాజు

గణపవరం: రాజకీయాలకతీతంగా గ్రామాలాభివృద్ధికి కలసి పనిచేద్దామని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం గణపవరం మండల పరిషత్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన సమావేశానికి మండలపరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ధర్మరాజు మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధిపై ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రం తాకట్టులో ఉందని అన్నారు. అందువల్ల పార్టీలకతీతంగా కలసి పనిచేయాలని సూచించారు. తహశీల్దార్ అప్పారావు మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని చెప్పారు. వెటర్నటీ డాక్టర్ నాగజ్యోతి మాట్లాడుతూ మండలంలో రైతులు తమ పశువలకు పశుబీమాపథకం చేయించుకోవాలని చెప్పారు. భీమా పథకానికి రూ.400 చెల్లిస్తే సరిపోతుందని, దీని వల్ల పశువు మరణిస్తే రూ.30 వేలు ప్రభుత్వం రైతుకు అందచేస్తుందని చెప్పారు. పశువులకు గాలికుంట వ్యాధి సోకకుండా మందులు అందచేస్తున్నట్లు తెలిపారు. ఉపాధిహామీ పనులపై అధికారులు సరిగ్గా దృష్టి పెట్టడం లేదని సర్పంచులు విమర్శించారు. వెంటనే ఎంఎల్‌ఎ ధర్మరాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఉపాధిహామీ పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి పనిచేయాలని తెలిపారు.

అధికారులు ప్రజలకు చేరువ కావాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కారంతో ప్రజలకు చేరువవ్వాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో 'మీకోసం, పిజిఆర్‌ఎస్' అర్జీల పరిష్కారంపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు అర్జీదారుని సమస్యను మేలైన రీతిలో పరిష్కరించి వారికి చేరువ కావాలన్నారు. ప్రభుత్వం పిజిఆర్‌ఎస్‌పై ప్రత్యేక దృష్టి సారించిందని, సకాలంలో స్పందించి ప్రభుత్వ నిబంధనల మేరకు అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. అర్జీలో పేర్కొన్న అంశంలోని ప్రాధాన్యతను బట్టి ఒక్కో అర్జీకి ఒక్కో సమయం ఉంటుందని, అది 24 గంటల నుండి 120 రోజుల్లోపుగా పరిష్కరించేందుకు ఆన్‌లైన్‌లోనే షెడ్యూల్ సమయం నిర్ణయించి ఉంటుందన్నారు. అలా అని చివరి నిమిషం వరకు వేచి చూసే ధోరణి ఉండకూడదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్ణీత గడువు దాటకూడదని, నిర్ణీత గడువు దాటితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరాం ప్రసాద్, డిఎస్‌ఒ ఎన్.సరోజ, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్‌ఎస్.వేణుగోపాల్, డ్వామా పీడీ ఎం.ప్రభాకర్‌రావు, డిఎంహెచ్‌ఒ డి.మహేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పుష్పరాణి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కె.మురళీకృష్ణ, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి గణపతిరావు, మున్సిపల్ కమిషనర్లు కె.రామచంద్రారెడ్డి, బివి.రమణ, డివి.సారథి, ఎం.కృష్ణమోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు క్రీడలు దోహదం

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

కాగడాతో ర్యాలీలో పాల్గొన్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి, ప్రముఖులు

జాతీయ సమైక్యతను కాపాడటంలో క్రీడలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. అలాగే మానసిక, శారీరక ఆరోగ్యాలను పెంపొందించేందుకు దోహదపడతాయని చెప్పారు. ప్రముఖ హాకీ క్రీడాకారులు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డిఎన్‌ఆర్ కళాశాల, ఎన్‌సిహెచ్‌బిఆర్‌ఎం హైస్కూల్‌లో మూడు రోజులపాటు నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాలను ఆయన ప్రారంభించారు. క్రీడా జ్యోతి వెలిగించిన అనంతరం క్రీడా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు జాతీయ సమైక్యతా భావాలను పెంపొందిస్తాయన్నారు. నేడు ఒలింపిక్స్‌లో కూడా మన భారతీయ క్రీడాకారులు విజయాలు సాధించడం గొప్ప విశేషమన్నారు. బాల్యం నుంచి క్రీడల పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించాలన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి ఎం.రాజేష్ మాట్లాడుతూ మూడు రోజులపాటు వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని, పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈ నెల 29న ప్రశంసాపత్రాలను అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఎ పిఒ శ్యామ్‌సుందర్, తహశీల్దార్ రవి రాంబాబు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, సిఐ కాళీచరణ్, డిఎన్‌ఆర్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు, జాయింట్ సెక్రటరీ కూనపరాజు రామకృష్ణంరాజు, ప్రిన్సిపల్ జి.మోజేష్, పీడీ బివి.నరసింహరాజు, పిఇటిలు జిపిసి.శేఖర్‌రాజు, పి.రామభద్రిరాజు, పివి.నరసింహారాజు, డాక్టర్ గాదిరాజు రంగరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఓటర్లుగా చేరండి

ప్రభుత్వ, జెడ్‌పి, ఎయిడెడ్ సంస్థల్లోని ఉపాధ్యాయులు అర్హులు

నమోదుకు సెప్టెంబర్ 3వ తేదీ తుది గడువు

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం

భీమవరం: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నిక రాబోయే రోజుల్లో జరగనుందని, ఈ నేపథ్యంలో ఎన్నికకు ఓటర్లుగా నమోదు కావాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో కొత్తగా ఓటర్ల జాబితా తయారు కానుందని పేర్కొన్నారు. సెప్టెంబర్ మూడో తేదీ వరకూ అవకాశం ఉందని తెలిపారు. ఓటరుగా చేరేందుకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ సంస్థల్లో పని చేసే ఉపాధ్యాయులు అర్హులని పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబర్‌కు ముందు ఆరేళ్లలో కనీసం మూడేళ్లు బోధనలో ఉన్నవారు ఓటర్లుగా నమోదయ్యేందుకు అర్హులని తెలిపారు. ఓటరుగా చేరేందుకు ఫారం-19 అన్ని హైస్కూళ్లు, కళాశాలలకు పంపించామని పేర్కొన్నారు. ఇంకా ఎవరికైనా అవసరమైతే అయితే యుటిఎఫ్ మండల, పట్టణ శాఖల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు వారిపై అధికారుల ద్వారా ఫారం-19 పూర్తి చేసి సంబంధిత మండల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మెడికల్ క్యాంప్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గుండె జబ్బులున్న చిన్నపిల్లలకు ఉచిత మెడికల్ క్యాంప్‌ని మంగళవారం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు కార్యాలయంలో వసుధ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించినట్లు వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఈ క్యాంపులో కొత్తగా వచ్చిన 10 మంది చిన్నపిల్లలకు ఉచితంగా హార్ట్ చెకప్ 2డి ఎకో మిషన్ ద్వారా నిర్వహించారు. గత క్యాంపులో వచ్చి ఆపరేషన్ చెయించుకున్న ఇద్దరు పేషెంట్లకు గుండె ఫంక్షన్ మెరుగైనట్లుగా 2డి ఎకో చెకప్ చేసి డాక్టరు తెలిపారు. ఈ క్యాంపులో ప్రతినెల క్రమం తప్పకుండా పాల్గొని ఉచితంగా సేవలందిస్తున్న ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ విక్రమ్‌కి ఇందుకూరి ప్రసాదరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గుండె జబ్బు గుర్తించిన చిన్నపిల్లలకు ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లుగా తెలిపారు. ఈ కార్యాలయంలో రెగ్యులర్‌గా ఉచిత ఆసుపత్రి నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం తెలిపారు. ఈ సౌకర్యాన్ని అందరూ వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్‌టిఆర్ గృహనిర్మాణ బకాయిలు చెల్లించాలి

వ్యకాస ఆధ్వర్యాన వినతి

ఆర్‌ఐకు వినతిని అందజేస్తున్న వ్యకాస నాయకులు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎన్‌టిఆర్ గృహనిర్మాణ పథకం లబ్ధిదారులకు బకాయిలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తణుకు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్ఐ బి.భవానికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వం ఎన్‌టిఆర్ గృహనిర్మాణ పథకం అమలు చేసి సొంత స్థలం, ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు రూ.1.50 వేలు చెల్లిస్తామని ప్రకటించిన ప్రభుత్వం అప్పట్లో బిల్లుల చెల్లింపులలో కాలయాపన చేసిందని పేర్కొన్నారు. 2019 తర్వాత ఆనాటి ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గృహ నిర్మాణ బకాయిలు చెల్లించాలని స్పందన కార్యక్రమం ద్వారా కలెక్టర్‌కు, స్థానిక ఎంఆర్‌ఒకు అనేకసార్లు దరఖాస్తులు పెట్టుకొని బాధలు విన్నవించుకున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. అప్పు చేసి ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులు అంతా చేసిన అప్పులకు గడిచిన గత కొన్ని సంవత్సరాలుగా వడ్డీల మీద వడ్డీలు కట్టి అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని వీరభద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎన్‌టిఆర్ గృహనిర్మాణ బకాయిలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం తక్షణం బకాయి చెల్లించి తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి దొంగల నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు బండారు వెంకటేశ్వరరావు, పిండి సుబ్బారావు, కోయిల మహాలక్ష్మి, డి.విజయకుమారి, శ్రీరాములు, సత్యనారాయణ, షేక్ దర్గా బేబీ, రాధాకుమారి, గుత్తకొండ అనంతలక్ష్మి, సుబ్బలక్ష్మి, పోలిశెట్టి దుర్గా పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై అవినీతి ఆరోపణలపై విచారణ

బినామీ మస్తర్లు.. ఒకే ఫొటో పది వర్కులకు అప్లోడ్ చేశారని ఆరోపణలు

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దొంగ మాణిక్యాలరావు బినామీ మస్తర్లు వేసి అవినీతికి పాల్పడుతున్నాడని పలువురు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామీణ అభివృద్ధి శాఖ భీమవరం క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుజాత మంగళవారం గ్రామసభ నిర్వహించి, విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ 20 మంది పనిచేస్తే సుమారు వందమందికి మస్తర్లు వేస్తున్నాడని.. ఒకే వర్క్ ఫొటోను 10 వర్కులకు అప్లోడ్ చేశాడని అధికారులకు తెలియజేశారు. ఫొటోలకు సంబంధించిన డేటాను అధికారులకు అందించారు. ఫీల్డ్ అసిస్టెంట్ చేసిన అవకతవకలపై సుమారు 100 పేజీల నివేదికను అధికారులకు అందించామని ఫిర్యాదులో తెలిపారు. గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీల పేర్లను చదువుతామని, వాటికి సంబంధించిన ఫిర్యాదులు అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలని ఎపిడి తెలిపారు. ఒకే ఫొటోను అనేక వర్కులకు ఎందుకు అప్లోడ్ చేశారని ఫీల్డ్ అసిస్టెంట్ ఎపిడి ప్రశ్నించగా అతని వద్ద నుంచి ఏ సమాధానం రాకపోవడం గమనార్హం. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్‌జిఎస్ విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న మహిళకు కూడా ఉపాధి హామీ కూలీగా మాస్టర్లు వేయడానికి వేయడాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాక పనికి వెళ్లలేని వారిని సైతం ఉపాధి కూలీలుగా నమోదు చేశారని తెలియజేశారు. నిబంధనలు అతిక్రమించి అవినీతికి పాల్పడ్డ ఫీల్డ్ అసిస్టెంటును తొలగించాలని పలువురు గ్రామస్తులు ఎపిడిని కోరారు. ఇదిలా ఉంటే బర్రె భూలక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ తాను ప్రస్తుతం కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నానని, మూడు సంవత్సరాలుగా ఉపాధి హామీ కూలీల పని చేస్తున్నానని, ఇంతవరకు పైసా కూడా చెల్లించలేదని, ఫీల్డ్ అసిస్టెంట్‌ని అడిగితే ఇదిగో అదిగో అంటూ వాయిదాలు వేస్తూ మాయమాటలు చెబుతున్నాడని, తనకు న్యాయం చేయాలని ఆమె ఆవేదన చెందుతూ ఎపిడికి విన్నవించింది. కేన్సర్ బాధితురాలిని సైతం మోసగించిన ఫీల్డ్ అసిస్టెంట్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఆమెకు న్యాయం చేయాలని పలువురు గ్రామస్తులు ఎపిడిని కోరారు. విచారణ అంశంపై ఎపిడి సుజాతను వివరణ కోరగా విచారణలో అంశాలపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ త్రిశూల, సర్పంచి బర్రె మేరీ, పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీనివాస్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలోని జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలకు అద్దేపల్లి గంగరాజు ధర్మసత్రం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఫౌండర్ అండ్ ఫ్యామిలీ ఛైర్మన్ అద్దేపల్లి మోహన్ దాస్ ఆధ్వర్యంలో ఆచారి ద్వారా 200 నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సంస్థ చేసే కార్యక్రమాలను శ్రీవారి విద్యార్థులకు వివరించారు. సంస్థ ద్వారా విద్యార్థులకు ఉచిత భోజనం, పుస్తక దానం, ఉచిత హోమియో క్లినిక్ ద్వారా పేదలకు మందుల పంపిణీ, పేద మహిళలకు వస్త్రదానం మొదలైన కార్యక్రమాలు సత్రం చేపడుతుందన్నారు. విద్యార్థులు ఈ నోట్ బుక్స్ ఉపయోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాల హెచ్ ఎం.రాయుడు భవానీప్రసాద్ పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 30 మంది ఎంపిక

పాలకొల్లు : శ్రీదాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ సహకారంతో సంధ్య మెరైన్స్ వారు నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 220 మంది పాల్గొనగా 30 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ డైరెక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. హాజరైన అభ్యర్థులనుద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాధాకుమారి, బుద్ధరాజు ప్రసంగించారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, సంధ్య మెరైన్స్ తరపున ఏడుకొండలు, సురేష్ రెడ్డి, కిషోర్ రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఎంపిపి దంపతులకు సత్కారం

వీరవాసరం : కేంద్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఢిల్లీ ఎర్రకోట వద్ద స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఎనలేని అనుభూతిని పొందానని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అన్నారు. ఎంపిపికి వచ్చిన ఆహ్వానం మేరకు ఢిల్లీ ఆగస్టు పర్యటనను పురస్కరించుకుని కొనితివాడ ప్రాథమిక వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వీరవల్లి దుర్గాభవాని, చంద్రశేఖర్ దంపతులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను పరిపాలనలో భాగస్వాములను చేసి వారిని ప్రోత్సహించే విధంగా ఈ అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ఢిల్లీలో కిరణ్ బేడి లాంటి పలువురు ప్రముఖులను కలవడం జరిగిందన్నారు. వైద్యాధికారి నవీన్, యడర రాజు వీరభూపతి పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు గాలికి..

తాడేపల్లిగూడెం: ఈనెల 23న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు జరిపి ఎవరి గ్రామంలో స్థానిక నాయకులు కలిసొచ్చే పనులు మాత్రం చేసే విధంగా వర్క్స్‌లు తయారు చేసుకున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి నుంచి వారి కార్యకర్తలకు కలిసొచ్చే విధంగా చేయడం చంద్రబాబుకి అలవాటని, పెన్షన్లు పెంచి ప్రజల ఆశలమీద నీళ్ళు కప్పడానికి ఇచ్చారన్నారు. రెండో నెల కొంతమందికి ఎగ్గొట్టారన్నారు. మూడో నెలలో చేస్తారో ఎవరికి అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. సూపర్ 6 అన్నారు. దాని పరిస్థితి ఏంటో అర్థం కావట్లేదన్నారు. ప్రభుత్వం దిగే నాటికి ఫీజు రియింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులు పెట్టి ఉంచితే ఇప్పటి వరకు వాటిని జమచేయలేదన్నారు. ఆరోగ్యశ్రీకి నిధులు ఇవ్వట్లేదు. ఈ కూటమి ప్రభుత్వం ప్రజలను కష్టాల సంద్రంలోకి తోసేసారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ఏవిధంగా ఇచ్చిన హామీలను నెరవేర్చారో ఆ విధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మిషన్‌శక్తి పథకంపై అవగాహన

పాలకొల్లు రూరల్: పాలకొల్లు ఎంపిడిఒ కార్యాలయంలో సిడిపిఒ ఇందిర ఆధ్వర్యంలో చైల్డ్ మ్యారేజ్ ప్రొటెక్షన్ ఆఫీసర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిర మిషన్ శక్తి పథకంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలపై వరుడు, వధువు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, వారి అంగీకార పత్రాలు తీసుకునే విషయంలో సిఎం పిఒలు ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. సమాజంలో ఉన్న దురాచారాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి గ్రామంలో ప్రతి బుధవారం ఆయా ఏరియాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, బాల్య వివాహాలను నిర్మూలించాలని తెలియజేశారు.

ప్రారంభమైన శిక్షణా తరగతులు

తాడేపల్లిగూడెం: ఉద్యానశాస్త్ర అధ్యయనంలో, పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం జోడించు అవసరమని, తద్వారా అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఉద్యానశాస్త్ర పరిణామాలతో విద్యార్థుల సమన్వయం చేసుకోవచ్చని డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ తెలిపారు. డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉద్యాన సాగు సుస్థిరత' అనే అంశంపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ఆన్‌లైన్ ద్వారా ప్రారంభమైంది. ఈ ట్రైనింగ్ కార్యక్రమంలో నాలుగు ప్రాంతాల ఉద్యాన కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొంటున్నారని తెలిపారు.

శుద్ధి జలాలు అందించేందుకు కృషి

మొగల్తూరు : గ్రామాలలోని ప్రజలకు శుద్ధి జలాలు అందించేందుకు అధికారులు కృషిచేయాలని ఎంపిపి బొమ్మిడి సత్యవాణి సూచించారు. మండలంలోని కోమటిపల్లి గ్రామంలో గల రక్షిత మంచినీటి చెరువులో ఫిల్టర్ బెడ్, కుళాయి చెరువును మంగళవారం గ్రామస్తులు, అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజలకు గత ప్రభుత్వం కన్నా మెరుగైన సేవలను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మోహనరావు, జనసేన మండల అధ్యక్షులు కొల్లాటి గోపీకృష్ణ, సర్పంచులు ఒప్పులాధి సూర్యనారాయణ, కొప్పాడ ఉమా మహేశ్వరరావు ఉన్నారు.

వికలాంగురాలికి ట్రై సైకిల్ బహూకరణ

తాడేపల్లిగూడెం: గత రెండు రోజులుగా మంగళగిరి జనసేన కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న జనవాణి కార్యక్రమంలో గుంటూరు జిల్లాకు చెందిన ఒక వికలాంగురాలు ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌ను విన్నవించుకోగా, తనకు ట్రై సైకిల్ కావాలని కోరడంతో సొంత నిధులతో ట్రై సైకిల్ కొని మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద రాజకీయ వ్యవహారాల ఇన్‌ఛార్జ్, ఎంఎల్‌సి పి.హరిప్రసాద్ చేతుల మీదుగా ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అందజేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కొత్త ఎస్‌ఐ ఎప్పుడొస్తారో?

దొంగతనాలు పెరిగాయని స్థానికుల ఆందోళన
కొత్త ఎస్‌ఐని నియమించాలని వేడుకోలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆచంట అసెంబ్లీ నియోజకవర్గంలో 18 పంచాయతీ గ్రామాలు, బ్రాహ్మణ చెరువు, వనంపల్లి, కోమటి చెరువులంక వంటి శివారు గ్రామాలు ఉండగా గడచిన నాలుగు నెలలుగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఎస్‌ఐ లేకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. నియోజకవర్గంలో ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర పోలీస్ స్టేషన్లు మూడు పెనుగొండ సర్కిల్ పోలీస్ స్టేషన్లో ఉన్నాయి. గడిచిన సార్వత్రిక ఎన్నికల అనంతరం, ఓట్ల లెక్కింపు ప్రారంభం కాక ముందే ఫలితాలు ఊహించి, ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ సెలవుపై వెళ్లిపోవడంతో అప్పటి నుంచి ఇన్‌ఛార్జిలతోనే స్టేషన్ నడుస్తోంది. ఇదిగో, అదిగో కొత్త ఎస్‌ఐ వస్తున్నారు అంటూ ఊహాగానాలతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు, అనుమానాస్పద మృతులు, బాణసంచా గోడౌన్ ప్రమాదం వంటి సంఘటనలు జరగ్గా అన్నింటికీ ఇన్‌ఛార్జిలు వచ్చి దర్యాప్తులు జరిపారు. మార్టేరు, నెగ్గిపూడి ప్రాంతాల్లో ఇటీవల బైకు దొంగతనాలు పెరిగాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల ముందు, షాపులు బయట తాళం వేసి పార్క్‌చేసిన బండ్లు మాయం అవుతున్నాయని వారు వాపోయారు. జిల్లాలో పెద్ద మండలాల్లో ఒకటైన స్థానిక మండల పోలీస్ స్టేషన్‌కు నెలలు గడుస్తున్నా కొత్త ఎస్‌ఐని నియమించకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పెనుమంట్ర పోలీస్ స్టేషన్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ఎంఎల్‌ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌ఎ నాయకర్ అన్నారు. పట్టణంలోని 1వ వార్డు శ్రీహరిపేటలో నేషనల్ హెల్త్ మిషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సీజనల్ వ్యాధులపై అవగాహనా సదస్సులో ఎంఎల్‌ఎ నాయకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకువాలని సూచించారు. ఇంటి ఆవరణలో మురుగు నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, తద్వారా దోమలను అరికట్టవచ్చునని తెలిపారు. దోమల ద్వారా వ్యాపించే డెంగీ, మలేరియా వంటి విష జ్వరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అనారోగ్యం చేసినా వెంటనే వైద్యులను సంప్రదించి, తగిన వైద్య సదుపాయం పొందాలని తెలిపారు. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ వహించవద్దని ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నాయకర్ ప్రజలకు సూచించారు. పట్టణంలో ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తమ విధుల పట్ల అశ్రద్ధగా ఉండరాదని, ప్రతి ఇంటికీ తిరిగి వార్డులో ఫీవర్ సర్వే నిర్వహించి, జ్వర బాధితులను గుర్తించి, వారికి తగిన వైద్య సదుపాయం అందేలా కృషి చేయాలని అన్నారు. ఆరోగ్య శాఖ పట్టణంలో అవసరమైన మేరకు మెడికల్ క్యాంపులను ఎక్కువగా నిర్వహించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఎంఎల్‌ఎ నాయకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఉప అధికారి డాక్టర్ ప్రసాద్, డాక్టర్ మోహన, డాక్టర్ సత్య భూషణ్, నాయకులు బందెల రవీంద్ర, వలవల నాని, నిప్పులేటి తారక రామారావు, పోలిశెట్టి సాంబ, కెల్లా సత్తిబాబు, దొండపాటి స్వాములు, పొన్నాల నాగబాబు పాల్గొన్నారు.

అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ నాయకర్

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

గణపవరం: ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఒ జాలాదివిల్సన్ బాబు అన్నారు. మంగళవారం ఎ.గోపవరంలో 104, కేంపులో ఎయిడ్స్ నియంత్రణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీకు తెలుసా' కార్యక్రమంలో పాల్గొని స్థానికులకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్నచూపు చూడకుండా వారితో కలిసిమెలిసి జీవించే విధంగా సహకరించాలని తెలిపారు. ఎయిడ్స్ యాక్టు 2017, ఎఆర్‌టి మందులు, ఎపిఎస్‌ఎసిఎస్ యాప్‌లో టోల్ ఫ్రీ నెంబర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడ్ లాంప్ ప్రాజెక్టు ఔట్ రిచ్ కార్యకర్త పి.సాగర్, కేర్ అండ్ సపోర్టు సెంటర్ తాడేపల్లిగూడెం పీతల జేమ్సు, సిబ్బంది, గ్రామ ఎన్ఎం పి.పుష్పావతి, పిఇ కమల, ఆశావర్కర్లు, వెల్నెస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతులకు బస్‌పాస్‌ల పంపిణీ

పెనుమంట్ర : నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి, మండల మానవత సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28 బుధవారం ఉదయం నుంచి విభిన్న ప్రతిభావంతులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ, బస్‌పాస్‌ల పంపిణీ జరుగుతుందని మానవతా శాఖ అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, కార్యదర్శి ఎస్.మురళీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మార్టేరు మానవతా కార్యాలయంలో ఉచిత మెగా బస్సు పాస్ ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఉచిత బస్‌పాస్‌లు కావలసిన వారు ఆధార్ కార్డు ఒరిజినల్, జిరాక్స్, విభిన్న ప్రతిభావంతుల మెడికల్ సర్టిఫికెట్ ఒరిజినల్, జిరాక్స్, ఒక ఫొటో తప్పనిసరిగా తెచ్చుకోవాలని వారు కోరారు.

కొవ్వలిని కలిసిన నూతన సిఐ

నరసాపురం: టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడును మంగళవారం ఆయన నివాసంలో నూతనంగా నరసాపురం పట్టణ సిఐగా బాధ్యతలు చేపట్టిన బి.యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. రామ్మోహన్ నాయుడుకు సిఐ యాదగిరి పూలమొక్క అందించారు. అనంతరం ఇరువురు శాంతిభద్రతల విషయంపై చర్చించుకున్నారు.

పోలీసులకు ఉచిత రక్త పరీక్షలు

భీమవరం టౌన్: సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కాళీ చరణ్ ఆధ్వర్యంలో భీమవరం టూ టౌన్ పోలీస్ సిబ్బందికి మంగళవారం ఉచిత రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాళీ చరణ్ మాట్లాడుతూ పోలీసు విధి నిర్వహణలో తమ సిబ్బంది ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలనే ఉద్దేశంతో సిబ్బందికి రక్తపరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. రిపోర్టుల ఆధారంగా వైద్యులను సంప్రదించి ఎస్‌పి ఆదేశాలతో వైద్య సహాయం అందించడానికి సిద్ధమవుతున్నామని కాళీ చరణ్ అన్నారు.

నేడు 2కె రన్

తణుకు : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీచిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాలలో ఈనెల 28 ఉదయం 7 గంటలకు 2కె రన్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు అండర్ 12, 14, 17, 20 బాలురు, బాలికలు, పురుషులు, స్త్రీల విభాగాలలో నిర్వహించి బహుమతులు అందజేయుట జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎస్.సూర్యనారాయణ 9989363978, కె.బాబురావు 8247260545 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

కాళీపట్నం పడమర పంచాయతీ కార్యదర్శిగా సత్యనారాయణ

మొగల్తూరు: కాళీపట్నం పడమర పంచాయతీ కార్యదర్శిగా ఎం.సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం రామన్నపాలెం కార్యదర్శి బి.కృష్ణ ప్రసాద్ ఇక్కడ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం భాస్కరరావుపేట కార్యదర్శి సత్యనారాయణ ఇక్కడక బదిలీపై వచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

పాలకొల్లు : వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, అసిస్టెంట్ కమీషనర్, పాలకొల్లు వాణిజ్య పన్నుల శాఖ వారి కార్యాలయంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. పాత ప్రభుత్వ నిర్ణయాలకు బలి అయ్యామని ప్లేకార్డ్స్‌తో తమ అభ్యర్థనను కొత్త ప్రభుత్వంకు తెలిపారు. ప్రాంతీయ కార్యాలయాలు, సిఆర్‌యులను రద్దు చేసి సర్కిల్ వ్యవస్థను బలోపేతం చేయాలని, అంతవరకు బదిలీలు వాయిదా వేయాలని నినాదాలు చేశారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా, రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా జరిగిన ఉద్యోగుల బదిలీలు రద్దు చేయాలని కోరారు. తమ శాఖలో అధికారాల కేంద్రీకరణకు స్వస్తి పలికి అధికారాల వికేంద్రీకరణ దిశగా అడుగులు వేయాలని కోరారు. జిఎస్‌టిఐలకు చట్టబద్ధ అధికారాలు కల్పించాలని, సర్కిల్ వ్యవస్థను బలహీన పరిచే చర్యలను వ్యతిరేకిస్తున్నామని కోరారు. ఉద్యోగుల బదిలీలపై ఒక శాశ్వత విధానం రూపొందించాలని డిమాండ్ చేశారు.

భరత్‌కుమార్‌కు పురస్కారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నత్తారామేశ్వరం గ్రామ వాసి, అంబేద్కర్ ఆలోచనా వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సిహెచ్‌వి ఆర్.భరత్‌కుమార్ విజయవాడలో పౌర సన్మానం అందుకున్నారు. ప్రపంచశాంతి దూత మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా, విజయవాడ మదర్ సర్వీస్ సొసైటీ 2వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో సామాజిక సేవలు అందిస్తున్న వ్యక్తులకు పౌర సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక వేత్త, విద్యావేత్త, సీనియర్ జర్నలిస్ట్, సామాజిక ఉద్యమనేత భరత్ కుమార్‌కు ప్రపంచమేధావి, భారతరత్న, బాబాసాహెబ్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయ సేవారత్న అవార్డు, ప్రశంసాపత్రం, దుశాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మదర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు మల్లాది ప్రసాద్ రావు, రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు, బత్తుల సంజీవ్ నాయుడు, హర్షిత డెవలపర్స్ జనరల్ మేనేజర్ సంపత్ కుమార్, మనం ఫౌండేషన్ ఫౌండర్ చక్రవర్తి, హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ఛైర్మన్ దాసు, దామా మధుసూదనరావు, వరంగల్ జిల్లా కానిస్టేబుల్, రక్త ధాత కన్నె రాజు, బహుజన్ న్యూస్ రిపోర్టర్(ఆదోని) బి.శ్రీనివాస్, మమత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కోరుకొండ జాన్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ ఉద్యోగిణి కటికతల జయమణి, గుదే రాజారావు, బందెల ప్రమీల జార్జ్ రాజు, మంగం సత్యనారాయణ, పలువురు స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, సాంస్కృతిక, కళా, నృత్య రంగాలలో పనిచేస్తున్న కళాకారులు పాల్గొన్నారు.

జ్వరాలపై జాగ్రత్త వహించండి

డాక్టర్ ప్రతాప్ కుమార్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జ్వరాలు ప్రబలుతున్న గ్రామాలలో సర్వే నిర్వహించి, జ్వరం లక్షణాలు గల వారిని గుర్తించి రక్త నమూనాలు సేకరించి అవసరమైన వారికి టైఫాయిడ్ పరీక్షలు, ప్లేట్లెట్ పరీక్షలు, డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహిస్తున్నామని డాక్టర్ ప్రతాప్ కుమార్ తెలియజేశారు. వాతావరణంలో మార్పుల వల్ల దగ్గు, రొంప, జ్వరం లక్షణాలు ఉంటున్నాయని వాటికి వెంటనే చికిత్స తీసుకోవాలని తెలిపారు. తదుపరి పరీక్షలకు వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. భగ్గేశ్వరం గ్రామంలో నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేసి సర్వే చేయించామన్నారు. ఈ సర్వే ద్వారా నలుగురు సాధారణ జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి రక్త నమూనాలు సేకరించి, మందులు అందజేస్తున్నామని తెలిపారు. తదుపరి వైద్యానికి పిహెచ్‌సికి తరలించి వైద్యం అందిస్తున్నామన్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు, డ్రెయినేజ్ సమస్యపై, గ్రామ కార్యదర్శి లింగం సత్యనారాయణ, గ్రామ పెద్దలు దొంగ బాబాయ్, నిల్లా వీరభద్రుడు దృష్టిలో పెట్టామని, బ్లీచింగ్ చల్లించుటకు, ఎబేట్ మందు స్ప్రేయింగ్ చేయుటకు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, హెల్త్ అసిస్టెంట్లు ఏసునాదం, తారకసత్య ప్రసాద్, ఎఎన్ఎం భారతి, ఎంఎంఎల్‌హెచ్ పి.శ్రావణి, ఆశా కార్యకర్తలు చింతపల్లి లక్ష్మి, కొయ్యే బేబీ పాల్గొన్నారు.

రోడ్డుపక్క ఇళ్ల తొలగింపునకు యత్నం

అడ్డుకున్న సిపిఎం నేతలు, నివాసితులు

ప్రజాశక్తి - ఆకివీడు

సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా అధికారులు అక్కడకు చేరారు. వెంటనే ఇళ్లు ఖాళీ చేయాలంటూ పోలీసులను ఆదేశించారు. దాంతో కంగారు పడ్డారు నివాసితులు. అయ్య భీమవరం రోడ్డులో మంగళవారం సాయంకాలం పరిస్థితి ఇది. రోడ్డు పక్కన ఆక్రమణదారులు ఇల్లు నిర్మించుకొని ఎంతోకాలంగా నివాసాలు ఉంటున్నారు. అయితే వీరికి ఎక్కువ మందికి తాళ్లకోడు లో స్థలాలు ఇచ్చామని, వెంటనే ఇక్కడ ఇల్లు ఖాళీ చేయాలని అధికారులు చెప్పారు. మిగిలినవారికి పట్టాలు ఇస్తామని వారన్నారు. ఈమెరకి ఇల్లు ఖాళీ చేయాలనే గతంలో చాలా సార్లు చెప్పామని అధికారులు అన్నారు. అయితే తమకు చెప్పలేదని కనీసం పది రోజులు టైం ఇస్తే ఇళ్లు ఖాళీ చేస్తామని నివాసితులు అన్నారు. ఈ దశలో విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ కనెక్షన్లు తీసివేశారు. సరిగ్గా అదే సమయంలో పట్టణం, మండలంలోని అన్ని విభాగాల అధికారులు అక్కడికి చేరారు. ఆ వెనకే ఎంఎల్‌ఎ రఘురామ కృష్ణరాజు అక్కడికి వచ్చారు. ఆ వెనుక ఉన్న మూలలంక బోధి, మరో రెండు పంట బోదులు, మురుగుబోదులకు నీరు పారుదల పూర్తిగా ఆగిపోయిందని, ఆ దిగివనున్న పంట పొలాలకు సాగునీరు అందటం లేదని ఆయన వివరించారు. సాగునీటి పారుదలకు వెంటనే కాలువలు బాగు చేయవలసి ఉన్నందున ఆ మేరకు అడ్డంగా ఉన్న ఇళ్లు మాత్రం తొలగిస్తామన్నారు. వారికి అత్యవసరంగా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం అప్పటికప్పుడు ఇళ్లు ఖాళీ చేయటం కష్టమని, పది రోజులు టైం అడుగుతూ నివాసితులు, సిపిఎం శ్రేణులు ఆందోళన చేపట్టారు. సుమారు రెండున్నర గంటల ఆందోళన అనంతరం టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి ప్రసాద్ కొంతమేర టైం ఇచ్చేందుకు అంగీకరించారు. ఆమేరకు తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు, సిఐ జగదీశ్వరరావు, ఎస్ఐ నాగరాజు, ఎంఆర్ఒ వెంకటేశ్వరరావు సిపిఎం నాయకులతో మాట్లాడుతూ వ్యాపార వర్గాలకు రెండు రోజులు, నివాసితులు పది రోజుల్లోగా ఖాళీ చేసేందుకు అంగీకరించారు. అందుకు వారు హామీ ఇచ్చారు. ఇద్దరు అంగీకరించడంతో కథ సుకాంతమైంది. సిపిఎం నాయకులు కె.తవిటి నాయుడు, పెంకి అప్పారావు, డొకల లక్ష్మి, బివి వర్మ, బి.రాంబాబు, దొడ్డి పద్మ, గోపి సెట్ రాంబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

జెసిని కలిసిన టిడిపి జిల్లా అధ్యక్షులు రామరాజు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డిని టిడిపి జిల్లా అధ్యక్షులు, ఉండి మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాహుల్ కుమార్ రెడ్డిని కలిసిన రామరాజు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

అన్న క్యాంటీన్‌పై తప్పుడు ప్రచారం

తీవ్రంగా ఖండించిన ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు: ఇటీవల తణుకు పట్టణంలోని అన్నా క్యాంటీన్ శుభ్రతపై, ప్లేట్‌లు ఎంగిలి నీటిలో కడుగుతున్నారు అంటూ సామాజిక మధ్యమాలలో వచ్చిన ప్రచారాలు పూర్తిగా అవాస్తమని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మండిపడ్డారు. స్పష్టంగా చేతులు కడుగు స్థలము అని రాసి ఉన్నా కావాలని బురద చల్లటానికి, చేతులు కడిగే సింకులో, అన్నం తిన్న ప్లేట్లు పడేసి, అదే సమయంలో, చేతులు కడిగే సింకు బ్లాక్ అవ్వటంతో, సిబ్బంది వచ్చి ఆ ప్లేట్లు, చెత్త తీస్తున్న సమయంలో ఒక 40 సెకండ్ల వీడియో తీసి వైసిపి నాయకులు సిగ్గు లేని తప్పుడు ప్రచారం చేపిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నడుపుతున్న అన్నాక్యాంటీన్ వల్ల పేదల ఆకలి తీరడం వైసిపి సైకోలకు ఇంగుడుపడటం లేదని, దానితో ఇలాంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఎంత విషప్రచారం చేసినా అన్నాక్యాంటీన్లు ఆగవని తెలియజేశారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సిఐ జగదీశ్వరరావు

కాళ్ల: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆకివీడు సిఐ జగదీశ్వరరావు అన్నారు. కాళ్ల హైస్కూల్లో విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, గంజాయి, ధూమపానం, మద్యం తాగడం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహనా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. ప్రధానంగా గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధన తప్పనిసరిగా పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులు ఇబ్బందులకు గురికావద్దని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

మామిడిశెట్టి దుర్గా వెంకటేశ్వర్లు, తండ్రి : శ్రీనివాసు, నివాసం: డి.నెం.0-20-56/1, కాకరపర్రు శివారు, వెంకట్రాయపురం, పెరవలి మండలం, తూర్పుగోదావరి జిల్లా, అను నేను ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నాకు చెందిన **ఒరిజినల్ దస్తావేజు నెం. 527-11708/2007, తేది. 20.06.2017** గలది. సదరు దస్తావేజును తీసుకొని **తేది. 10.08.2024**న మా ఇంటి వద్ద నుండి పెరవలి సెంటర్‌కి జిరాక్స్ నిమిత్తం వెళ్తుండగా సదరు దస్తావేజు జారి పడిపోయినది. ఎంతవెదికిననూ దొరకలేదు. కావున ఎవరికైనా దొరికినచో పైన తెలిపి చిరునామాకు అందచేయగలరు.

CHANGE OF NAME

I,VALLURI VENKATESWARA RAO, S/O KRISHNAMURTHI resident of d.no 3-8, NTR Center, Prathipadu village, Pentapadu mandalam, west godavari-534146. I have change my name from VALLURI VENKATESWARLU (OLD NAME) to **VALLURI VENKATESWARA RAO** (NEW NAME) Hence After all my documents and correspondence will be continue with my new name **VALLURI VENKATESWARA RAO**

CHANGE OF NAME

I, Gadhi Praveen Kumar, S/o Gadhi Bhaskara Rao, R/o Door No. 1-113, Gadhi vari thota, Rustumbada, Narasapur, Narasapuram Mandal, W.G.Dist. My daughter, Gadhi Jahnavi Gayathri, in her ICSE, X class, certificate her mother's name was wrongly registered as 'Gadhi Sandhya Rani instead of 'Gadhi Sandya Rani'. Mother's correct name is Gadhi Sandya Rani.

పేరు మార్పు ప్రకటన

మద్దా అభిషేక్ రాజు (కొత్తపేరు), తండ్రి : మద్దా ఇస్రాయేలు రాజు, డోర్‌నెం.1-142 పెద్దపేట, రాజీవ్‌గాంధీ, బొమ్మ దగ్గర, మహ దేవపట్నం, ఉండి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివశించుచున్నాను. ఇప్పుడు నాపేరును మద్దా అభిషేకరాజు (పాతపేరు) తండ్రి : మద్దా ఇస్రాయేలు నుండి మద్దా అభిషేక్‌రాజు (కొత్తపేరు) తండ్రి : మద్దా ఇస్రాయేలుగా మార్చుకున్నారు. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్తపేరును ఉపయోగించవలెను.

మద్దా అభిషేక్ రాజు, తండ్రి మద్దా ఇస్రాయేలు, మహదేవపట్నం, ఉండి మండలం, ప.గో.జిల్లా. ఎ.పి., సెల్ : 9912291119

లింక్ దస్తావేజు పోయినది

నా తాలూకు అనగా నేను ది.27-10-2004వ సం.రం. తేదీనాడు డిటో కాపురస్థులైన ముళ్ళపూడి సుగుణమ్మ, ముళ్ళపూడి నరేంద్రబాబు గార్ల నుండి ఏలూరు R.O లో దస్తావేజు నెం.9673/2004గా రిజిష్టరీ చేయించి క్రయం పొందినాను. నేను సదరు 9673/2004 యొక్క లింక్ దస్తావేజు నెం.446/1965 దస్తావేజును జిరాక్స్ నిమిత్తం ది.28-06-2024వ తేదీన ఉదయం 10 గంటలకు ఏలూరు కుండి సెంటర్ నందు జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళి జిరాక్స్ తీసుకొని సదరు దస్తావేజులు నా బ్యాగ్ మార్గమధ్యలో పడిపోయినది. బ్యాగు పోవుట చూసుకొని అదే మార్గములో జిరాక్స్ ఎంక్వయిరీ చేసినాను. సెంటర్ వద్దకు వెళ్ళినాను. ఎంక్వయిరీ సదరు బ్యాగు దస్తావేజున నెం.446/1965 దొరకలేదు. కావున ఎవరికైన దొరికిన ఎడల అప్పగించిన తగిన పారితోషికం ఇవ్వగలవాడను.

కొమ్మినేని నాగమణి, W/o.శ్రీనివాసరావు, 7-41, చెరువు గట్టు దగ్గర, వట్లూరు, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా. సెల్: 9989073587

S.R.K.R. ENGINEERING COLLEGE (AUTONOMOUS)
Accredited by AICTE, New Delhi and Affiliated to JNTUK, Kakinada, NAAC with A+ Grade, CHINNA AMIRAM (PO) :: BHIMAVARAM, W.G.Dt.
☎ 98488 23332

SPOT ADMISSIONS : APECET-2024

Vacant Seats in the 2nd Year **B. Tech** (Lateral Entry) that may arise out of non-reporting of the students to be filled by the college under Spot Admissions. Interested and eligible candidates (As per **APSCHE** Guidelines available in **ECET-2024** Admissions Website) are requested to approach the college with their original certificates and get themselves registered for the admission on or before 03-09-24. The admission made is provisional and is subjected to ratification by **APSCHE and JNTUK.**
Note :The Students who are admitted under spot admissions are not eligible for the fee reimbursement by the Govt of Andhra Pradesh. **Principal**